## క్లుప్తంగా

### కుప్పిలి కీర్తికి అభినందన



కీర్తిని అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: నగరంలో శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్‌ను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అభినందించారు. ట్రస్ట్ సేవలకు గుర్తింపుగా ఇటీవల ఐఎస్‌వో ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా కీర్తి శుక్రవారం పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయంలో మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కె.మోహనరావు పాల్గొన్నారు.

### మలేరియా కమిటీ సమావేశం నేడు

డాబాగార్డెన్స్: నగరంలో దోమల నియంత్రణకు చేపట్టే చర్యల్లో భాగంగా గత కౌన్సిల్ సమావేశంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఓ కమిటీ వేశారు. ఆ కమిటీ తొలి సమావేశం శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరగనుంది. దోమల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, తీసుకోనున్న చర్యలపై ప్రధానంగా చర్చించనున్నారు.

### నేటి నుంచి చేనేత వస్త్రాల ప్రదర్శన

బీచ్ రోడ్డు: చేనేత కార్మికులకు జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, అసోం, నాగాలాండ్, ఒడిశాకు చెందిన చేనేత వస్త్రాల ప్రదర్శనను శని, ఆదివారాల్లో పామ్‌బీచ్ హోటల్‌లో నిర్వహించనున్నట్టు టాటా ట్రస్ట్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అంతరన్ పేరుతో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా చేనేత కార్మికుల ఉపాధి కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు.

### యోగి వేమన చిత్రం ప్రదర్శనకు వినతి



వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్రకు వినతి పత్రం అందిస్తున్న నరవ ప్రకాష్

బీచ్ రోడ్డు: ఈ నెల 19న ప్రముఖ కవి యోగి వేమన జయంతి సందర్భంగా యోగి వేమన చిత్రాన్ని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఉచితంగా ప్రదర్శించాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాష్ కోరారు. ఈ మేరకు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్రను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు.

### లీకైన భూగర్భ డ్రైనేజీ



పాత వెంకోజీపాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో భూగర్భ డ్రైనేజీ లీకవుతుండడంతో మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సకాలంలో మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



# పేదల ఆనందమే సీఎం జగన్ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఆరిలోవ: పేదల ఆనందమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 13వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలసి విజయనిర్మల ఎర్నిదుర్గానగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు వెలగకపోవడం, తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, తదితర సమస్యల గురించి స్థానికులు అక్కరమాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సంక్షేమ పథకాలతో పొందుతున్న లబ్ధిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అక్కరమాని కోరారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ వనము వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, డాక్టర్ ఆర్.ఎస్.నాయుడు, శిరీషా, శంకరరావు, బీబీ, దుర్గారావు, శ్రీనివాస్, వెంకట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ప్రత్యేక సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సంగీత విభావరిని నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ ఖాన్ తెలిపారు. గీత్ సంగీత్ సంస్థ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ విభావరి వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ సాయంత్రం 5.45 గంటలకు సిరిపురం పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఏయూ అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో గువ్వలా ఎగిరిపోవాలి శీర్షికతో ప్రత్యేక సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే కీబోర్డు ఆర్టిస్ట్ చిప్పాడ సోమేశ్‌ను ఆత్మీయ పురస్కారంతో సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళా సంఘాల ప్రతినిధులు కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎస్.ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, శైలజా మెరాజ్, పేరి గీత పాల్గొన్నారు.

## 9న నివాస హక్కుల పోరాటంపై సదస్సు





జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మి, తదితరులు

సీతమ్మధార: ఈనెల 9న నివాస హక్కుల పోరాట దినంపై డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నట్టు మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ ఈ సదస్సులో కేంద్ర ఇంధన శాఖ పూర్వ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ప్రారంభోపన్యాసం చేయనున్నారని తెలిపారు. రైతాంగ ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఆశిష్ మిట్టల్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని అన్నారు. యూసీడీ డిపార్ట్‌మెంట్ కేటాయించిన 40 శాతం నిధులను మురికివాడల అభివృద్ధి, ఉపాధికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ కన్వీనర్ ఈసర లక్ష్మి, కో-కన్వీనర్ పరదేశి, అప్పారావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, బాలనాగమ్మ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నిర్మల, దళిత విముక్తి కన్వీనర్ ఎస్‌వీ రమణ, పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు



గొబ్బెమ్మల వద్ద పూజ చేస్తున్న మహిళలు

మద్దిలపాలెం: రాష్ట్రీయ సేవికా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 15వ వార్డు జేఆర్ నగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులు వేసి అబ్బురపరిచారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు న్యాయ నిర్ణేతలు రాష్ట్రీయ సేవికా సమితి ప్రతినిధులు భాను, పద్మజ బహుమతులు అందజేశారు. అనంతరం గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి సంక్రాంతి లక్ష్మీ పూజ చేశారు. పాత వెంకోజీపాలేనికి చెందిన కోలాటం సభ్యులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. ఈ సందర్భంగా అతిథి భాను మాట్లాడుతూ సంక్రాంతి పండగ విశిష్టత, ముగ్గులు, గొబ్బెమ్మల ప్రాధాన్యతను వివరించారు.

## రైల్వే హాస్పిటల్‌లో తొలి సారి..

సాధారణ ప్రసవం ద్వారా కవలల జననం



కవల శిశువులతో తండ్రి అశోక్‌కుమార్, రైల్వే ఆస్పత్రి వైద్య బృందం



డాక్టర్లు భాషిణి ప్రియాంక, శివకుమార్‌ను అభినందిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో శుక్రవారం సాధారణ ప్రసవం ద్వారా తొలి కవల పిల్లలు జన్మించారు. వివరాలిలా.. వాల్తేర్ డివిజన్ క్యారేజ్ అండ్ వేగన్ విభాగ ఉద్యోగి ఎం.అశోక్‌కుమార్ సతీమణి ఎం.హైమావతికి ప్రసవ సమయం కావడంతో రైల్వే ఆస్పత్రిలో చేర్పించారు. అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాషిణి ప్రియాంక, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.ఆర్.శివకుమార్ దుద్దుల నేతృత్వంలో వైద్య బృందం హైమావతికి సాధారణ ప్రసవం చేసేందుకు సిద్ధం చేశారు. వైద్యుల పర్యవేక్షణలో శుక్రవారం ఆమె కవల మగ పిల్లలకు జన్మనిచ్చింది. మొదటి బిడ్డ 2.76 కేజీలు, మరో గంట తరువాత జన్మించిన రెండో బిడ్డ 2.66 కేజీల బరువుతో సాధారణ ప్రసవం ద్వారా పుట్టినట్లు హాస్పిటల్ వర్గాలు తెలిపాయి.

**వైద్య బృందానికి డీఆర్‌ఎం అభినందనలు**

ఈ ఆస్పత్రిలో 2019లో డాక్టర్ భాషిణి ప్రియాంక గైనకాలజిస్టుగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఆమె నేతృత్వంలో సుమారు 175 సాధారణ డెలివరీలు చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో అసాధారణ కేసులను మాత్రమే ఈమె సిజేరియన్‌ను చేయించేవారని హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రైల్వే హాస్పిటల్ ఎటువంటి కేసులనైనా చేధించగలిగే స్థాయికి చేరుకుంది. ఈ ప్రక్రియలో ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.కె.వెంకటేశ్వర్లు, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.కె.తిరుఅరుల్ జోతి, అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అడ్మిన్) డాక్టర్ కె.పి.ఎస్.కాశీపతి, డాక్టర్ మహేష్‌కుమార్ అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అనస్థిటిస్ట్), ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, సుశిక్షితులైన లేబర్ రూం టీం భాగస్తులయ్యారు. ఈ అరుదైన ఘనత సాధించిన వైద్య బృందాన్ని డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రత్యేకంగా అభినందించారు.

## శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది(భీమిలి): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరాజు పట్టు వస్త్రాలను తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం అభిషేకం, పుష్ప నివేదన చేసి, శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు.

### ఏయూ సమాచారం

## అకడమిక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్‌గా కృష్ణ నియామకంపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్‌గా జాగ్రఫీ విభాగం ఆచార్యుడు ప్రొఫెసర్ టీవీ కృష్ణ నియామకంపై దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు శుక్రవారం ఏయూ వీసీ ప్రొఫెసర్ ప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు, ఉత్తరాంధ్ర మాల మహానాడు అధ్యక్షుడు సిర్ల శ్యాంసుందర్, డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ కొయ్య ఆనంద్, చదువుల ఆశాకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి గుమ్ములూరికి డాక్టరేట్



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు అందుకుంటున్న రాంబాబు

మద్దిలపాలెం: సింహాచలం దేవస్థానం, దేవాలయ పరిపాలన తదితర అంశాలపై 74 ఏళ్ల వయస్సులో చేసిన పరిశోధనకు కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

## 15వ వార్డు అభివృద్ధికి రూ.కోటి మంజూరు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి రూ.కోటి నిధులు మంజూరు చేశారని వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో తన అభ్యర్థన మేరకు ఈ నిధులు కేటాయించారన్నారు. ఈ నిధులతో సింహాద్రిపురం, లక్ష్మీనర్సింహనగర్, కొత్త వెంకోజీపాలెం ప్రాంతాలలో కొండవాలుకు రూ.49లక్షలతో రక్షణ గోడల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. శ్మశానవాటిక అభివృద్ధికి రూ.48 లక్షలు కేటాయించారని తెలిపారు.

## అలరించిన వయోలిన్ కచేరీ



కచేరీ చేస్తున్న మూర్తి

సీతంపేట: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శంకరమఠంలో మహాత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చన, రుద్ర హోమం, చండీ హోమం నిర్వహించారు. మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు సాయంత్రం స్వామిజీని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఎం.ఎస్.ఎన్.మూర్తి వయోలిన్ కచేరీ అలరించింది. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు టి.రవిరాజు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



మల్లారెడ్డి గోపాలరావు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. అతడి భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. కంచరపాలెం గౌరీనగర్‌లో నివాసముంటున్న మల్లారెడ్డి గోపాలరావు ఫైనాన్స్ కలెక్షన్ చేస్తుంటాడు. రోజూ మాదిరిగానే గురువారం సాయంత్రం విధులకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడి భార్య మల్లారెడ్డి దేవి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 5.3 అడుగుల ఎత్తు, ఇంటి నుంచి తెల్లచొక్కా మీద చెక్స్, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించాడు. కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆధ్యాత్మికం

## వైభవంగా 22వ పాశుర విన్నపం



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీ కాలనీ: సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీ ఆండాళ్ రచించిన తిరుప్పావై 22వ పాశుర విన్నపాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లిల్లీతో పాటు అనేక రకాల పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

## సాగర్‌నగర్‌లో ఆకతాయిల హల్‌చల్



సాగర్‌నగర్‌లో ఆకతాయిలు కోసేసిన బైక్ సీటు



బైక్ ఇంజిన్ వద్ద తొలగించిన వైర్లు

ఆరిలోవ: సాగర్‌నగర్‌లో ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలా చోట్ల తరచూ బైక్‌లు, ఆటోల సీట్లు తొలగించడం, పెట్రోల్ తీసేయడం చేస్తున్నారు. తాజాగా బుధవారం అర్ధరాత్రి వారు మరింత రెచ్చిపోయారు. సాగర్‌నగర్‌లో ఎంఐజీ క్వార్టర్స్‌లో నాలుగిళ్ల ముందు నిలిపిన బైకులపై పడ్డారు. ఆయా వాహనాలలో రెండింటికి పూర్తిగా సీట్లు తొలగించారు. మరో రెండింటి సీట్లు కవర్లు తొలగించి లోపల భాగాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేసి ఆ ప్రాంతంలో చిందరవందరగా పడేశారు. అక్కడితో ఆగకుండా బైకుల ఇంజన్ల వద్ద వైర్లు కట్ చేసేశారు. ఆ బైక్‌లు స్టార్ట్ కాకపోవడంతో వాటి యజమానులు లబోదిబోమన్నారు. గురువారం ఆరిలోవ పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సూర్యనారాయణ, కానిస్టేబుళ్లతో అక్కడికి చేరుకుని బైకుల పరిస్థితి పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై సీఐ ఇమాన్యుయేల్‌రాజు మాట్లాడుతూ నైట్ రౌండ్స్ మరింత అప్రమత్తం చేస్తామన్నారు. కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఆకతాయిలు, దొంగలను సులువుగా పట్టుకోవడానికి వీలుపడుతుందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన కాలనీల్లో దొంగతనాలు కూడా తగ్గుతాయని తెలిపారు.

## రెండు కుటుంబాలకు వైఎస్సార్ బీమా పరిహారం



లబ్ధిదారుకు వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో ఇటీవల మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా పరిహారం మంజూరైంది. గత ఏడాది జూలైలో బమ్మిడి వెంకటరావు, బండారు సత్తిబాబు మరణించారు. వారికి వైఎస్సార్ బీమా వర్తించింది. దీంతో వెంకటరావు, సత్తిబాబు కుటుంబ సభ్యులకు బీమాలో భాగంగా తక్షణ సహాయం కింద అప్పట్లో చెరో రూ.10 వేలు చొప్పున సచివాలయాల సిబ్బంది అందించారు. మిగిలిన రూ.90 వేలు చొప్పున నగదు ఇరువురికి గురువారం వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సచివాలయం సిబ్బందితో కలసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల సెక్రటరీలు రమణ, సురేంద్ర, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, దుర్గారావు, వెంకటరెడ్డి, బాబూరావు, శ్రీను, బేగం పాల్గొన్నారు.

## భారతీయ సంప్రదాయాలంటే ఇష్టం

- బాలభాను పాఠశాల సందర్శనలో విదేశీయులు



బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి

మురళీనగర్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలంటే తమకెంతో ఇష్టమని విదేశీయులు అన్నారు. గురుపూజోత్సవాల సందర్భంగా శుక్రవారం మురళీనగర్ బాలభాను పాఠశాలలో ఈస్ట్ వెస్ట్ బ్రదర్‌హుడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్, జర్మనీ, అర్జెంటీనా దేశాలకు చెందిన 40 మంది విశాఖ పర్యటనలో భాగంగా ఈ స్కూల్‌ను సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా బోధనా విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, వారు అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతులు, ఆచార వ్యవహారాలను వీరు దగ్గరుండి పరిశీలించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఆచరణీయమైనవన్నారు. విదేశీ వనితలు తెలుగు సంప్రదాయ దుస్తులు, చీరలు ధరించి సందడి చేశారు. ఆస్ట్రేలియా నుంచి రోసీ డియాజ్ డ్యూక్ గ్రూప్, జర్మనీ నుంచి రాబర్ట్ బడియా గ్రూప్, స్పెయిన్ నుంచి లూడ్గర్ ఫిలిప్స్ గ్రూప్ సభ్యులు, అర్జెంటీనా కంట్రీ గ్రూప్ నుంచి ఆల్‌బెర్ట్ బెలిజి, క్రిస్టియానా యూఎస్‌ఏ గ్రూప్ నుంచి మిక్వాల్, రోజా సగ్రోసా తదితరులు పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి, బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ రామకృష్ణరాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణరావు పాల్గొన్నారు.

## 11 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు



త్యాగరాజ ఆరాధనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి సహకారంతో త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నామని త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ప్రతినిధులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం కళాభారతి ఆడిటోరియంలో వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు జరగనున్నట్టు చెప్పారు. మృదంగ విద్వాంసుడు వంకాయల వెంకటరమణమూర్తిని సంగీత కళాభారతి బిరుదుతో సత్కరించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజు ట్రస్ట్ ప్రతినిధులు రామ్‌ప్రసాద్, పంతులు శ్రీనివాసరావు, మోహన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

సీతమ్మధార: భర్తతో గొడవ పడి మనస్తాపం చెంది ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం శ్రీనివాస నగర్‌లోని సంతోషిమాత గుడి దరి నివసిస్తున్న సిరిగిడి దివ్య(22)కు చోడిశెట్టి కామేశ్‌తో 2021 మేలో ప్రేమ వివాహం జరిగింది. శుక్రవారం ఉదయం భర్తతో గొడవ జరగడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. భర్త మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చే తలుపులు కొట్టినా తీయకపోవడంతో వాటిని పగలుగొట్టి లోపలికి వెళ్లే చూసేసరికి.. దివ్య ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.